## సోషల్ మీడియా పోస్టులపై..

# ప్రత్యేక దృష్టి పెట్టాం

- ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమిస్తే చర్యలు
- 'సీ- విజిల్' యాప్ 1950.. ఫిర్యాదుల కోసం సంప్రదించండి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, అక్టోబర్24(నమస్తే తెలంగాణ): సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాం.. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.. అని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్‌లోని జీ-36లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా పూర్తి సహకారం అందించాలన్నారు. శాసనసభ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. వార్తా పత్రికలు, ఈ పేపర్లు, డిజిటల్ పేపర్లు, టెలివిజన్ చానళ్లు, స్థానికంగా కేబుల్ నెట్ వర్కులు, సోషల్ మీడియా, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో, వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ ద్వారా ముందస్తు అనుమతి పొందిన తర్వాతే విడుదల చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శాటిలైట్ చానళ్లలో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి విధి విధానాలపై సలహాలు, సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ ఉన్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

### ఫిర్యాదులు, సలహాలపై దృష్టి సారించాలి

ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులు, సలహాలపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ 18004253050కు వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. అలాగే సీ-విజిల్ యాప్ 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, పరిష్కారం.. వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా 50 ఫిర్యాదులు రాగా.. వాటిని పరిష్కరించినట్లు వెల్లడించారు.

### అన్ని రకాల వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్వో హరిప్రియ, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్ ఉన్నారు.

# గులాబీ శ్రేణుల్లో జోష్

- ప్రచారంలో దూసుకెళ్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి 'లాస్య'
- వార్డులు, బస్తీల్లో కలియ తిరుగుతున్న లాస్యనందిత
- నేడు మూడో వార్డులోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర



ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండో వార్డులో పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత (ఫైల్)

కంటోన్మెంట్, అక్టోబర్ 24: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. గులాబీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. నోటిఫికేషన్ రాక ముందు నుంచే బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి గ్యాని లాస్యనందిత ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి వార్డులోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలను నేరుగా కలుస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వార్డులు, బస్తీల్లో ప్రతి రోజూ కలియతిరుగుతున్నారు. ఇదిలా ఉంటే.. ఇప్పటి వరకు ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించ లేదు. ఇప్పటికే 'లాస్య' అన్ని వర్గాలను ఒకసారి కలిశారు. తన దూకుడును కొనసాగిస్తున్నారు. దీంతో లాస్యనందిత ప్రచారం ముందు ప్రతిపక్షాలు బేజారులో ఉన్నాయని సర్వత్రా చర్చ సాగుతున్నది.

### ప్రతిపక్షాలు బేజార్..

ఎన్నికల షెడ్యూల్ కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ.. ఎన్నికల క్షేత్రంలో దూసుకుపోతున్నది. గెలుపే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో పాదయాత్రను చేపట్టిన ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనంది.. పకడ్బందీగా కార్యాచరణను అమలు చేస్తున్నారు. అన్ని స్థాయిల్లోని నేతలు, కార్యకర్తలను కలుపుకొని ఇప్పటికే ఒక రౌండ్ ప్రచారాన్ని పూర్తి చేశారు. ఫలితంగా బీఆర్ఎస్ అభ్యర్థి గ్రాఫ్ రోజురోజుకూ పెరిగిపోతున్నది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. గ్రూపులు, అంతర్గత కుమ్ములాటలకు కేరాఫ్‌గా మారిన కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో ఒకింత అసహనం సైతం వ్యక్తమవుతున్నది. టాప్ గేర్‌లో కారు దూసుకెళ్తున్నది. దీంతో బీఆర్ఎస్ సునాయాసంగా అధికారంలోకి వస్తుందన్న ధీమాను వివిధ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

### బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితకు రోజురోజుకూ మద్దతు పెరుగుతున్నది. ప్రతి బస్తీలో ప్రజాభిమానం వెల్లువెత్తుతున్నది. అభ్యర్థి ఎక్కడికి వెళ్లినా జనం తండోపతండాలుగా తరలివస్తున్నారు. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న పాదయాత్రకు సైతం ఊహకందని రీతిలో సబ్బండ వర్గాలు కదిలి వస్తున్నాయి.

### నేడు మూడో వార్డులో పాదయాత్ర..

ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మూడో వార్డులోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత పాదయాత్ర నిర్వహించనున్నారు. బోర్డు మాజీ సభ్యురాలు అనితాప్రభాకర్ నేతృత్వంలో భారీ ఎత్తున పాదయాత్రకు సన్నాహాలు చేస్తున్నారు. బాలం రాయి, అన్నానగర్, అంబేద్కర్‌నగర్‌తో పాటు పలు బస్తీల్లో పాదయాత్ర చేపట్టనున్నారు.

## మరాఠా మండల్ నేత షిండే మృతి తీరనిలోటు

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్



సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మరాఠా మండల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌కే. షిండే మృతి తీరనిలోటు అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఇటీవల లక్డికాపూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో షిండే మృతి చెందారు. మంగళవారం బర్కత్‌పురా ప్రాంతంలో ఉంటున్న మృతుడి భార్య అరుణా షిండే, కుమారుడు సమీర్ షిండేను పరామర్శించి.. షిండే చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. షిండే పోలీస్ శాఖలో 38 ఏండ్ల పాటు, మరాఠా సంఘంలో దశాబ్దాలుగా చేసిన సేవలను వినోద్‌కుమార్ గుర్తు చేశారు. ఆయన మృతి మరాఠా మండల్‌కు, రాష్ట్రానికి తీరని లోటని వినోద్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మరాఠా మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్‌పాటిల్, ఉపాధ్యక్షుడు మదన్ జాదవ్, నివాస్ నికం, క్రిస్టియన్స్ సంఘం రాష్ట్ర నాయకులు థామస్ జాన్ పాల్గొన్నారు.

## మాదన్నపేటలో యువతి ఆత్మహత్య

మాదన్నపేట, అక్టోబర్ 24: మానసిక వ్యాధితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాదన్నపేట పూలతోటకు చెందిన నందిని వివాహం ఎనిమిదేండ్ల కిందట జరిగింది. నాలుగు నెలల కిందట ఓ పాపకు జన్మనిచ్చింది. కొద్ది రోజులుగా ఆమె మానసిక వ్యాధితో బాధపడుతూ.. సోమవారం ఉదయం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## రైలు కిందపడి..

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 24: గుర్తు తెలియని ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీనివాస్ కథనం ప్రకారం.. భరత్‌నగర్- బోరబండ రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి సుమారు 35 ఏండ్ల వయస్సున్న ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఒంటిపై స్కై బ్లూ కలర్ ఫుల్ షర్టు, కాఫీ కలర్ ప్యాంటు ఉన్నదని, మృతదేహాన్ని ఉస్మానియా దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వివరాలకు 040-23202238, 9848349544 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## గ్యాస్ లీకై.. మంటలు

సైదాబాద్, అక్టోబర్ 24 : దసరా పండుగను పురస్కరించుకొని ఇంట్లో పిండి వంటలు చేస్తుండగా.. గ్యాస్ లీకై మంటలు వ్యాపించి విలువైన వస్తువులు కాలిపోయాయి. ఈ ఘటన సైదాబాద్ సింగరేణికాలనీలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సింగరేణికాలనీలోని గుడిసెల్లో నివసించే శశికళ స్థానికంగా కిరణాషాపు నిర్వహిస్తున్నది. దసరా పండుగను పురస్కరించుకొని ఇంట్లో పిండి వంటలు చేస్తుండగా.. సిలిండర్ అయిపోయింది. రెగ్యులేటర్ మరో సిలిండర్‌కు మార్చే క్రమంలో సరిగ్గా పెట్టకపోవటంతో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటలను గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంతో ఇంటిలోని టీవీ, ఫ్రిజ్, వంటసామగ్రి, ఇతర వస్తువులు కాలిపోయాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఘన్శిరాం తెలిపారు.

## యువతి బలవన్మరణం

మేడ్చల్, అక్టోబర్ 24 : మేడ్చల్‌లో ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని కిందబస్తీలో ఉంటున్న యాస్మిన్ సుల్తానా(18) ప్రైవేట్ ఉద్యోగి. సుల్తానా, అదే ప్రాంతానికి చెందిన సనా స్నేహితులు. ఇటీవల సనా వివాహమైంది. దీంతో సుల్తానా మనస్తాపానికి గురైంది. సోమవారం తన మరో స్నేహితురాలు యార్మిత్ కౌర్‌కు ఫోన్ చేసి, తన వద్దకు రావాలని కోరింది. ఆమె ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంగళవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో సుల్తానా ఉండే ఇంటికి వచ్చింది. అప్పటికే సుల్తానా దూలానికి చున్నీతో ఉరేసుకొని చనిపోయింది. వెంటనే ఆమె పోలీసులకు సమాచారమిచ్చారు. సుల్తానా సోదరి ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.